క్లుప్తంగా

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో లో ఓల్టేజీ సమస్యతో బోరుబావులకు సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆరోపించారు. గ్రామంలోని బీరప్ప గుడి దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు లో ఓల్టేజీ సమస్య ఉండడంతో సమీప వ్యవసాయ బోరు బావుల నుంచి నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వాపోయారు. వెంటనే అధికారులు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కడ్తాల్: మండల కేంద్రంలో రంజాన్ మాస తొలి శుక్రవారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీద్ ఇమామ్ మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మసీదులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, జావీద్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభను జయప్రదం చేయండి

కడ్తాల్: నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న నిర్వహించనున్న అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకుడు పాలాది ఆంజనేయులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పద్మశాలి కులస్తుల సమస్యలపై జరగనున్న సభకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని సూచించారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అంజయ్య, నాయకులు యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం



అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా పోతుగంటి అశోక్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య చేతుల మీదుగా అశోక్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రెండోసారి పదవి నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరి ప్రీతంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ఎ.శంకర్, భాస్కర్, జగన్, సుధీర్‌రెడ్డి, శ్రీనునాయక్, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ గృహిణి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం .. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో నివాసం ఉండే సుష్మ(35) కొంత కాలంగా గర్భకోశ వ్యాధితో బాధపడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త ఇద్దరు కుతూర్లు ఉన్నారు.

ఉద్యాన హబ్‌గా ‘రంగారెడ్డి’

- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పైలెట్ ప్రాజెక్టు గ్రామాల రైతులతో సమావేశం



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం: జిల్లాను కూరగాయలు, ఆకుకూరల హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల రైతులతో శుక్రవారం యాచారం రైతువేదికలో అధికారులు సమావేశమయ్యారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, నాబార్డు అధికారులు హాజరయ్యారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్కార్ నుంచి ఏ విధంగా ప్రోత్సాహం అందిస్తే కూరగాయల, ఆకుకూరల దిగుబడి పెరుగుతుంది, మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధరలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ హయాంలోని మాదిరిగా రాయితీపై విత్తనాలు, నాణ్యమైన నార్లు, వ్యవసాయ పరికరాలు, మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు, డ్రిప్ సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ దిగుబడులు సాధిస్తామని అన్నదాతలు తెలియజేశారు.

త్వరలో సీఎంని కలుస్తాం

ఫ్యూచర్‌సిటీని దృష్టిలో ఉంచుకొని అత్యధికంగా కూరగాయలు, ఆకుకూరలు పండించడమే లక్ష్యంగా ఈ గ్రామాలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. ఆయన మాట్లాడుతూ... పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండగా ఉంటామన్నారు. విత్తనాలు, పనిముట్లు, డ్రిప్, మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్టుకు నిధుల మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. అంతకు ముందు ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి స్టాళ్లను పరిశీలించారు. సమావేశంలో డైరెక్టర్లు రాములునాయక్, సునీల్ కుమార్, రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, నర్సింహారెడ్డి, వెంకన్నయాదవ్, భవాని, ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి సురేష్, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏఈ రవినాథ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మేడిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని చెప్టతండాలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మేడిగడ్డతండా–శంకరకొండతండాల మధ్య కత్వ వాగుపై రూ.3.10 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు బీటీరోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కత్వవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, మాజీ ఎంపీపీ అనిత, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, నాయకులు జగన్, మానయ్య, రాంజ్యానాయక్, విజయ్‌రాథోడ్, హరిలాల్, కిషన్, నరేశ్, అంజ్య, శ్రీకాంత్, పీఆర్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అభిషేక్‌త, ఎంపీఓ వినోద తదితరులు పాల్గొన్నారు. శంకరకొండ తండా గ్రామ పంచాయతీ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని తండావాసులు నరేశ్, హనుమంతు, మహిపాల్, అంజ్య, బాలు, సికిందర్, బీమా, జైపాల్, సిద్దు, శ్రీకాంత్‌లు కోరారు.



ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న శంకరకొండతండావాసులు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కడ్తాల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైసిగండిలో నేలతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

కడ్తాల్: గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో లో ఓల్టేజీ విద్యుత్ కారణంగా సమస్యలు తలెత్తుతుండటంతో స్థానికులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయా కాలనీలలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వెంటనే సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. బీసీ కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రాజేశ్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్, మహేందర్, తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

యాచారం: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనుల్లో వెట్టి చాకిరీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెల, నెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే బిల్లు కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, నాయకులు కృష్ణ, నరేందర్, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఇబ్రహీంపట్నంరూరల్: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని త్రిశక్తి కాలనీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్‌సాగర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా సరఫరా చేయడం లేదన్నారు. సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తదితర సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య, అధ్యక్షుడు రవి, కార్యదర్శి పురుషోత్తం, సభ్యులు అరుణ, రాంరెడ్డి, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు సత్కారం



ఆమనగల్లు: పట్టణంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆధ్వర్యంలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా కార్మికులను రాము, శ్వేతలు ఘనంగా సత్కరించారు. అనంతరం కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు ప్రణీత, అంజుం, హర్షియా, సుజాత, సంధ్య, అర్చన, అనూష, నాయకులు వేణు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 50 మంది మహిళా ఉపాధ్యాయులకు ఒకేచోట శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. వీటిని రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం ఇంద్రాసేనారెడ్డి మాతృమూర్తి కళావతి స్మారకార్థం ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్షుడు డాక్టర్ పరమేష్, సెక్రెటరీ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఆనంద్‌కుమార్, రమేష్‌బాబు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులకు జ్ఞాపికలు అందజేస్తున్న పరమేష్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మహేశ్వరం: మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. పురుషులతో సమానంగా ముందుండాలి. పోలీస్ వ్యవస్థలో హోం గార్డు నుంచి ఎస్పీ వరకు అతివలున్నారు. దేశంలో ఏ రాష్ట్రాల్లో లేని విధంగా మహిళలకు రక్షణగా షీ టీమ్ ఉంది. మనల్ని చూసి ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నారు. ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో ఆడపిల్ల కావాలనే ఆలోచన బలపడింది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ ప్రస్తుతం విమానాలు నడపడం, రాజ్యాలను పాలించే స్థాయికి ఎదగడం గర్వకారణం.

– సునీతారెడ్డి, డీసీపీ, మహేశ్వరం

వేడుకకు వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

- ఆటోను ఢీకొట్టిన బైక్
- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: వివాహ వేడుకకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా డివైడర్ వద్ద యూటర్న్ చేసుకుంటున్న ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఓ మహిళా దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్ కట్ట కింద ఉన్న సుందరయ్యనగర్‌లో నివాసం ఉండే వి.కవిత, వి.రాములమ్మలు ఆటోలో మన్నెగూడ సమీపంలో ఉన్న జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రాత్రి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి రాత్రి 11:45 నిమిషాలకు ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో తుర్కయంజాల్ చెర్వు కట్టపై ఉన్న బుద్ధ విగ్రహం వద్ద యూటర్న్ చేసుకుంటుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న నంబర్ ప్లేటు లేని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత(48) తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆటోలో ఉన్న రాములమ్మ, డ్రైవర్ హేమకు తీవ్ర గాయలయ్యాయి. బైక్ రైడర్ పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లిఫ్ట్ అడిగి.. మృత్యు ఒడిలోకి

పట్టు తప్పడంతో కింద పడి దుర్మరణం



నర్సింహ (ఫైల్)

మహేశ్వరం: బైక్ అదుపు తప్పడంతో వెనకాల కూర్చున్న వ్యక్తి కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... ఘట్టుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నర్సింహ(38) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన మన్సాన్‌పల్లి నుంచి స్వగ్రామానికి బిహార్ రాష్ట్రానికి చెందిన సూరజ్ బైక్‌ను లిఫ్ట్ అడిగి వెనకాల కూర్చున్నాడు. ఈ క్రమంలో సరిగా పట్టుకోకపోవడంతో బైక్‌పై నుంచి నర్సింహ కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. బైక్ నడుపుతున్న సూరజ్‌కు సైతం గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

మీర్‌పేట: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(55) కర్మన్‌ఘాట్‌లో నివాసముండే కూతురి వద్దకు గురువారం వచ్చాడు. సాయంత్రం 5 గంటలకు నాగోలులో ఉండే స్నేహితున్ని కలిసేందుకు వెళ్లాడు. తిరిగి రాత్రి 11.30 గంటలకు బస్సులో టీకేఆర్ కమాన్ వద్ద దిగి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన చింటు అనే వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి జాతర
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు సాగే ఉత్సవాలు ఈ నెల 13వ తేదీన ముగియనున్నాయి. చారిత్రక నేపథ్యం కలిగిన ఆలయంలో జాతరను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పండితులు తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పనులు చకచకా సాగుతున్నాయి. ఉత్సవాలకు కేశంపేట్, తలకొండపల్లి, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని కొత్తపేట్, న్యామతాపూర్, మక్తమాధారం, పడకల్, పెద్దూరు, నేదునూర్, కొనాయిపల్లి, మన్నెగూడ, చల్లంపల్లి, సాలార్‌పూర్, వెంకటాపూర్, వంపుగూడ తదితర గ్రామస్తులు తరలిరానున్నారు. అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేపడుతున్నారు.



కొలువైన వేంకటేశ్వరస్వామి

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు

9న అభిషేకం, అంకురార్పణ, తీర్థ ప్రసాద వితరణ, 10న నిత్యారాధన, ధ్వజారోహణం, గరుడవాహన సేవ, 11న స్వామివారి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 13న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, చక్రతీర్థం, ధ్వజారోహణంతో పూర్ణహుతితో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా మహాభిషేకం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, సాయంత్రం ఎదుర్కోలు కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త తెలిపారు.

